# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 30-07-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ఆరోగ్య కరమైన జీవనశైలిని దైనందిన జీవితంలో అవలంబించేలా ప్రజలకు వైద్యులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు

- ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సాయుధ దళాల శక్తి సామర్థ్యాలు ప్రపంచానికి తెలిశాయని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్ పేర్కొన్నారు.

- నైసార్ ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైందని ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ ప్రకటించారు.

- దేశంలోని అన్ని రాష్ట్రాల్లో వందే భారత్ రైలు సేవలను విస్తరించనున్నామని రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

- మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను మరో ఆరు నెలల పాటు పొడిగించేందుకు లోక్‌సభ ఈరోజు ఆమోదం తెలిపింది.

==============================

దేశ ఆరోగ్య సంరక్షణలో వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని ఎయిమ్స్ కళ్యాణి తొలి స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ఈరోజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ... రోగనిరోధకత సామర్థ్యంలో భారతదేశం గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. గత సంవత్సరం ట్రోకోమా రహిత దేశంగా భారత్ ప్రకటించబడిందని తెలిపారు. మధుమేహం, గుండె జబ్బులు, ఊబకాయం వంటి ఆరోగ్య సమస్యలను నియంత్రించడంలో వైద్యులు తమ వంతు కృషి చేస్తున్నారని చెప్పారు. కొత్త కొత్త పరిశోధనలు, వైద్య పద్ధతులపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యులకు సూచించారు. పేదలకు ఉచిత వైద్య సేవలను అందించడంలో డాక్టర్ బి.సి.రాయ్ ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆరోగ్య కరమైన జీవనశైలిని దైనందిన జీవితంలో అవలంబించేలా ప్రజలకు వైద్యులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని రాష్ట్రపతి సూచిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పహల్గాం ఉగ్రవాద దాడికి ప్రతిస్పందనగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సాయుధ దళాల శక్తి సామర్థ్యాలు ప్రపంచానికి తెలిశాయని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. ఈరోజు ఉదయం రాజ్యసభలో ఆపరేషన్ సిందూర్‌పై తిరిగి చర్చ చేపట్టారు. ఈ సందర్భంగా జైశంకర్ మాట్లాడుతూ... ఆపరేషన్ సిందూర్ సమయంలో సాయుధ దళాల పనితీరు దేశాన్ని గర్వపడేలా చేసిందన్నారు. ఆర్టికల్ 370 రద్దు తరువాత అభివృద్ధి చెందుతున్న జమ్మూ కాశ్మీర్ ఆర్థిక వ్యవస్థను నాశనం చేయడమే పహల్గాం ఉగ్రదాడి వెనుక ఉద్దేశమని వెల్లడించారు. పాకిస్తాన్ ఉగ్రవాదానికి తన మద్దతును పూర్తిగా ఉపసంహరించుకున్నంత వరకూ సింధూ జలాల ఒప్పందం నిలిపివేత కొనసాగుతుందని జైశంకర్ స్పష్టం చేశారు.

(వాయిస్ 40 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నైసార్ ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైందని ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ ప్రకటించారు. ఈరోజు సాయంత్రం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరి కోటలో ఉన్న సతీష్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం (షార్) నుండి జీఎస్ఎల్వీ-ఎఫ్16 వాహక నౌక ద్వారా ఈ ఉపగ్రహాన్ని నింగిలోకి ప్రవేశపెట్టారు. ప్రయోగించిన 19 నిమిషాల అనంతరం నిర్దేశిత కక్ష్యలోకి ఇది చేరుకుందని ఇస్రో చైర్మన్ పాత్రికేయుల సమావేశంలో వెల్లడించారు. సూర్య అనువర్తిత కక్ష్యలోకి ప్రవేశపెట్టిన మొట్టమొదటి ఉపగ్రహ ప్రయోగం ఇదేనని వి.నారాయణన్ వెల్లడిస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మణిపూర్‌లో కొనసాగుతున్న రాష్ట్రపతి పాలనను మరో ఆరు నెలల పాటు పొడిగించేందుకు లోక్‌సభ ఈరోజు ఆమోదం తెలిపింది. గత ఫిబ్రవరి 13న మణిపూర్‌లో విధించిన రాష్ట్రపతి పాలనను పొడిగించడానికి సభ ఆమోదం కోరుతూ.. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆ రాష్ట్రంలో సాధారణ స్థితిని కొనసాగించడానికి రాష్ట్రపతి పాలనను పొడిగించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రపతి పాలన విధించినప్పటికీ ఒక్క హింసాత్మక సంఘటన చోటు చేసుకుందని.. అందులో ఒకరు ప్రాణాలు కూడా కోల్పోయారని సభకు తెలియజేశారు. మణిపూర్‌లో సంపూర్ణంగా శాంతిభద్రతలను నెలకొల్పేందుకు కృషి చేస్తున్నామని నిత్యానంద్ రాయ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని అన్ని రాష్ట్రాల్లో వందే భారత్ రైలు సేవలను రానున్న 3 సంవత్సరాల్లో విస్తరించనున్నామని రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈరోజు లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ.... మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ.. జనరల్ బోగీల సంఖ్యను పెంచామన్నారు. గత పది సంవత్సరాలతో పోలిస్తే రైలు ప్రమాదాల సంఖ్య 77 శాతం తగ్గిందని వెల్లడించారు. దేశీయంగా అభివృద్ధి చేసిన కవచ్ వంటి నూతన సాంకేతికతలను ప్రవేశపెట్టడం ద్వారా ప్రభుత్వం, ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అశ్వినీ వైష్ణవ్ వివరిస్తూ....

(వాయిస్ 40 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

“సంచార్ సాథి” పోర్టల్ సహాయంతో దేశవ్యాప్తంగా కోటీ 36 లక్షల నకిలీ మొబైల్ కనెక్షన్‌లను తొలగించామని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖా మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. ఈరోజు లోక్‌సభలో ప్రశ్నోత్తరాలకు ఆయన సమాధానమిస్తూ... మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న 35 లక్షల మందికి పైగా ఈ పోర్టల్ ద్వారా ఫిర్యాదులు చేశారని, వాటిలో 21 లక్షల మొబైల్ ఫోన్లను ఇప్పటికే గుర్తించామని అన్నారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, భద్రతా సంస్థలు, టెలికాం సర్వీస్ ప్రొవైడర్లు సహా 620 సంస్థలు ఈ పోర్టల్‌తో అనుసంధానించబడ్డాయని.. సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలను నివారించడానికి ఇది దోహదపడుతుందని జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అశ్లీలత, హింసను ప్రోత్సహించే అభ్యంతరకర వీడియోలను ప్రసారం చేసే పలు ఓటీటీ వేదికలను ప్రభుత్వ నిషేధించిందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయమంత్రి డా.ఎల్.మురుగన్ లోక్‌సభకు వెల్లడించారు. ఇప్పటి వరకూ అటువంటి 43 ఓటీటీ వేదికలను బ్లాక్ చేశామని తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కాశ్మీర్‌లో ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా అమర్‌నాథ్ యాత్రను ఈరోజు నిలిపివేశారు. ఉభయ మార్గాల్లోనూ ఈరోజు తెల్లవారుజాము నుండి భారీ వర్షాలు కురవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని అధికారులు వెల్లడించారు.  రేపు బల్టాల్ బేస్ క్యాంప్ నుండి బయలుదేరవలసిన మరో బృందాన్ని కూడా నిలిపివేశామని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తూర్పు రాజస్థాన్, పశ్చిమ మధ్యప్రదేశ్‌లలో రాగల 24 గంటల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది. ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే రెడ్ అలర్ట్ ప్రకటించింది. అలాగే హిమాచల్ ప్రదేశ్, జమ్మూ-కాశ్మీర్ ఉత్తరాఖండ్‌లో కూడా భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఇదిలా ఉండగా ఒడిశా, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాల్లో గత రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని భారత వాతావరణ శాఖ (IMD) వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పౌర పురస్కారలైన పద్మ అవార్డులకు నామినేషన్ల చివరి తేదీని ఆగస్టు 15 వరకు పొడిగించారు. అవార్డులకు నామినేషన్లను రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ నందు ఆన్‌లైన్ విధానంలోనే స్వీకరిస్తున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించే పద్మ అవార్డులు-2026కు సంబంధించిన నామినేషన్లు మార్చి 15న ప్రారంభమయ్యాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =